# ఒకే రంగం - రెండు దృశ్యాలు

**మా ఇంట్లోని మూలగది అంటే నాకు చెప్పలేనంత ఇష్టం. మా దాగుడు మూతల ఆటలూ, పాటలూ, బొమ్మలపెళ్లిళ్లూ... అన్నీ ఆ గదిలోనే. అందుకే అదంటే అంత ఇష్టం.**

కడుపుతో వున్న మా అమ్మ పక్క ఆ గదిలోకి మార్చారు. మా ఆటలకి ఇబ్బందొచ్చింది.

"ఇక్కడేం బావోదమ్మా, గదిలో కెళ్లిపో" అని మారాం చేశాను గాని అమ్మ వినిపించుకోలేదు.

"కొద్దిరోజులేనే!"

"ఇక్కడెందుకు పడుకోవాలి?"

"నీకు చిన్ని తమ్ముడు పుడతాడని" అంటూ నవ్వింది అమ్మ.

ఆ నవ్వు ఎంత గొప్పగా వుందో! అప్పుడు అమ్మ బుగ్గల్లో సొట్ట పడి ఎంత ముద్దొచ్చిందో!

"తమ్ముడెలా పుడతాడు?"

అమ్మ ముసిముసిగా నవ్వింది. ఎత్తుగా వున్న పొట్టని చూపించి "ఇందులో బజ్జున్న బుజ్జికన్నని దేవుడు బయటికి తీసిస్తాడు"అంది.

నాకేమీ అర్ధం కాలేదు. కాని అర్ధమైనట్టు తలాడించాను.

"అందుకనే ఈ మూలగదిలో వుంచారా? దేవుడు ఇక్కడికే వస్తాడా?"

నా మాటల కేమన్పించిందో అమ్మ కళ్ళల్లోకి నీరొచ్చింది. కన్నీటి రెప్పల్ని టపటపలాడించి తలాడిస్తూ నా తల నిమిరింది.

"తమ్ముడికి నా బొమ్మలన్నీ ఇచ్చేస్తా."

"ఇద్దరూ కలిసి ఆడుకుందురుగాని. తమ్ముడెప్పుడూ కొట్టకూడదు సుమా."

"కొట్టనే కొట్టను. ఒట్టు."

నన్ను దగ్గరకి తీసుకోబోయి ఆగింది. పొట్టమీద చేతులుంచుకుని ఒగర్చసాగింది. అమ్మ ముఖంలో బాధ, భయం కదలాడాయి.

"అమ్మా! ఏమయ్యిందమ్మా.....?"

"నొప్పులొస్తున్నాయి బుజ్జీ ... నానమ్మని పిలు."

రివ్వునెళ్లి నానమ్మకి చెప్పాను. అంతా హడావిడిగా మూలగదిలోకి వెళ్ళారు. నన్ను మాత్రం లోపలికి రానివ్వలేదు. ఇరుగమ్మా పొరుగమ్మా వచ్చారు. మంత్రసాని వచ్చింది. అంతా హైరాన పడుతోంటే మోకాళ్ళమీద తల పెట్టుకుని కూర్చుండిపోయాను. ఏడుపొచ్చేస్తోంటే గొనుతో



తుడుచుకుంటూ బిక్కుబిక్కుమని గది వంక చూస్తూ చూస్తూ కటిక నేలమీదే పడుకుని నిద్రపోయాను.

చిన్న పిల్లాడి ఏడ్పు విన్పించి ఉలిక్కిపడి లేచాను. మూలగదిలోంచి విన్పిస్తోం దా ఏడ్పు. గబుక్కున లేచి గదివైపు వెళ్ళబోతుంటే "బుజ్జీ! - నీకు తమ్ముడు పుట్టాడే. వంశం నిలించిందే" అంటూ ఇంత పంచదార తెచ్చి నా నోట్లో పోసింది నానమ్మ.

ఎగిరి గంతేశాను. పరుగునెళ్ళి చిన్నికీ చిట్టికీ నానికీ గుండూగాడికీ నాకు తమ్ముడు పుట్టాడని గొప్పగా చెప్పివచ్చేను. ఇకనుంచి వాళ్ళ జట్టుకి రాననీ, తమ్ముడితోనే ఆడుకుంటాననీ కూడా చెప్పాను.

మూలగదిలోంచి అంతా వచ్చేశాక మెల్లగా పిల్లిలా లోపలి కెళ్లాను.

అమ్మ నిద్రపోతోంది. అమ్మ పక్కనే ముడుచుకుని పడుకుని నిద్రపోతున్నాడు బుజ్జి తమ్ముడు. రబ్బరు బొమ్మంత వున్నాడు. ఎర్రగా వున్నాడు. తలమీద కొంచెం జుట్టు ఉంది. పిడికిళ్లు గట్టిగా బిగించేసుకున్నాడు.

మంచం ప్రక్కనే తమ్ముడ్ని చూస్తూ నిలబడ్డాను.

వాడెప్పుడు పెద్దవుతాడో ఎప్పుడు మాట్లాడతాడో, ఎప్పుడు నాతో ఆడుకుంటాడో ఏమో!

"తమ్ముడు బాగున్నాడా బుజ్జీ!" అమ్మ అంది.

తలాడించాను.

**వారం వారం కథాప్రభ**

"తమ్ముడ్ని ఎత్తుకోనా అమ్మా?"

"ఇప్పుడు కాదు. పురుడెళ్ళాక ఎత్తుకుందువు గాన్లే. వాడ్ని నువ్వే ఆడించాలి బుజ్జీ!"

"ఓ ఆడిస్తాను. ఇంతచిన్నగా ఉన్నాడేంటమ్మా తమ్ముడూ?"

"పుట్టినప్పుడు అంతా ఇలానే వుంటారు."

"నేను కూడా ఇలాగే వుండేదాన్నా?"

"నువ్వేంటి.. నేనైనా ఇంతే." నవ్వింది అమ్మ.

అమ్మ నన్ను ఆట పట్టిస్తోందన్పించింది. "నువ్వు ఇంత చిన్నగా వుండటమేమిటమ్మా. నే న్నమ్మను."

"పిచ్చిదానా! పుట్టడం, పెరగటం, గిట్టడం, మళ్ళీ పుట్టడం... ఇదో చక్రభ్రమణం!"

"అంటే?"

"నీ కర్థం గాదులే. దేవుడు నారు వేస్తాడు. నీరు పోస్తాడు. ఏరు దాటించి తన దగ్గరకి తీసుకుపోతాడు."

"ఎందుకూ?"

"మళ్ళీ పిండి బొమ్మని చేసి దాన్లో ప్రాణం పొయ్యడానికి."


"అంటే ఏంటమ్మా?" అమ్మ మాటలు కొత్తగా, వింతగా వున్నాయి. ఒక్కముక్కా అర్థం కావట్లేదు.

"పెద్దయ్యాక తెలుస్తుందిలే!"

"తమ్ముడెప్పుడు పెద్దవుతాడు?"

"నేను ముసిల్దాన్నయ్యాక." నవ్వింది అమ్మ. ఆ నవ్వు అదోలా వుంది. భయమేసింది.

"అలా నవ్వకు అమ్మా... భయంగా ఉంది."



"పిచ్చీ! అంతా పెద్దవుతాం. ముసలాళ్ళ మవుతాం. చచ్చిపోతాం."

"అయితే నానమ్మ ముసిల్దైపోయిందికదా. చచ్చిపోద్దా?"

"తప్పు. అలాంటి మాటలు మాట్లాడకూడదు. వెళ్ళి ఆడుకో. అల్లరి చెయ్యకు - నానమ్మను విసిగించకుసుమా."

"అమ్మా - ఈ గదిలో అదో వాసనగా వుందేవిటమ్మా?"

"దాన్ని పురిటి వాసన అంటారు. పురుటి స్నాన మయ్యేవరకూ అలాగే వుంటుంది. అందుకే ఎవరూ లోపలికి రాకూడదు."

"ఓహో." అర్థమైనట్టుగా తలాడించి వచ్చేశాను.

తమ్ముడికి బారసాల చేశాం. బోల్డుమందికి భోజనాలు పెట్టాం. ఉయ్యాల తొట్టెలో వేసి ఊపాం. పాటలు పాడాం. శనగలు పంచిపెట్టాం. తమ్ముడిపేరు నాన్న బియ్యంలో రాశాడు. అంతా అక్షింతలు చల్లారు. కొత్త బట్టలు, రకరకాల బొమ్మలు, ఏవేవో వేడుకలు-అంతా ఎంతో సరదాగా, సంతోషంగా గడిచిపోతూండగా నానమ్మకి జబ్బుచేసింది.

నానమ్మ మంచం మీంచి కదిలేది కాదు. మందులూ, డాక్టర్లూ, దగ్గులూ, విరోచనాలూ, బంధువులూ - ఎంతో హడావిడి. ఏదో భయం. ఆడుకోవాలనే అన్పించేది కాదు. ఎన్నో కబుర్లు కథలూ చెప్పే నానమ్మ మాటా మంతీ లేకుండా పడుండటం చూసి ఏడుపొచ్చేది.

నాన్నావాళ్ళూ కూడబలుక్కుని నానమ్మని మూలగదిలోకి తీసుకెళ్ళి పడుకోబెట్టారు. ఎందుకో ఏమీ అర్థంకాలేదు.

"ఇక్కడి కెందుకు తీసుకొచ్చారు నాన్నా? దేవుడొస్తాడనా?"

"చిన్న పిల్లవి... అలాంటి పెద్ద మాటలు మాట్లాడకూడదు. వెళ్ళిక్కడ్నుంచి." నాన్న కసిరారు.

ఏడుపొచ్చింది. అక్కడ్నుంచి వెళ్ళనని మారాం చేశాను. బలవంతాన అమ్మ లాక్కుపోయింది.

ఎవరూ లేకుండా చూసి మూలగదిలోకి వెళ్ళాను.

'నానమ్మా! నీ దగ్గరే పడుకుంటాను నానమ్మా' అని ఏడ్చాను.

నానమ్మ గాజుకళ్లతో చూసింది. కంట్లోంచి నీరు కారిపోతోంటే నా తల నిమిరింది.

"మాట్లాడు నానమ్మా! నాకు భయంగా ఉంది నానమ్మా!"

బోల్డురోజులు ఆ మూలగదిలోనే వుంది నానమ్మ. బడినుంచి రాగానే నానమ్మ దగ్గరకి పరుగెత్తేదాన్ని. ఎన్నోకబుర్లు చెప్పేదాన్ని. అన్నీ వింటూండేది గాని జవాబిచ్చేది కాదు. ఎందుకో ఆ గదిలోకి వెళ్ళటం అమ్మకి ఇష్టం లేదు. మాటిమాటికీ తిట్టేది. ఇదివరకు చిన్నతమ్ముడు పుట్టినప్పుడు రోజా ఆ గదిలోకి రమ్మనే అమ్మ ఇప్పు డాగదివంకే చూడొద్దంటోంది. అమ్మకి నానమ్మ అంటే ఇష్టమే మరి. ఎంచేతో అలా అనేది. అయినా చాటుగా వెళ్ళేదాన్ని. చూస్తే మాత్రం అమ్మ తిట్టిపోసేది.

ఎప్పట్లా ఆవాళ మూలగదిలో కెళ్ళాను. ఏదో వాసన నన్ను వుక్కిరి బిక్కిరి చేసింది. ఇది పురిటి వాసన కాదు. మరేంటి?

ఏదో భయం ఆవరించగా "నానమ్మా" అంటూ అరిచాను.

అంతా పరుగునొచ్చారు. నన్ను దూరంగా తీసుకెళ్ళారు. నానమ్మచెయ్యి పట్టుకుని చూశారు. నాన్నా వాళ్ళూ ఏదేదో గొణుక్కున్నారు. నానమ్మని మంచంమీంచి దించి చాపమీద పడుకోబెట్టారు.

"నానమ్మకి చాప గుచ్చుకుంటుంది. మంచం మీదే పడుకోనియ్యి నాన్నా!" ఏడుస్తూ అన్నాను.

"నానమ్మ చనిపోయింది బుజ్జీ."

నమ్మలేకపోయాను. కళ్ళు రిక్కించి చూశాను. నిజమే... నానమ్మ కళ్ళు చూట్టం లేదు. మనిషి కదల్టం లేదు. బిగుసుకు పోయినట్టుంది!

"నానమ్మా!" బావురుమని ఏడ్చాను.

అమ్మా, పిన్నీ, అత్తయ్యా అంతా ఏడ్చారు.

నానమ్మకి కొత్తచీర కట్టి పూలదండలేసి బుక్కాయి జల్లుతూ ఎక్కడికో తీసుకుపోయారు. ఆ తర్వాత ఎప్పుడూ నానమ్మ కన్పించలేదు.

నా కిప్పుడు మా ఇంట్లోని మూలగది అంటే పరమ అసహ్యం!


వరం వల్ల పుట్టి
స్వయం వరం వల్ల భరతవంశంలో మెట్టి
కా వరం వల్ల కౌరవు లవమానిస్తే భరించి....
ధీరంగా, పౌరుషంగా .
జీవితంలో మునుముందుకు నడిచిన

'ద్రౌపది'

ఐతిహాసిక నవల

ప్రముఖ కవి ఆరుద్ర,
ప్రసిద్ధ రచయిత్రి కె. రామలక్ష్మి
కథనం చేస్తారు

త్వరలో